

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number 9059328777



రంగారెడ్డి ఆదివారం 24-05-2026 సంపుటి: 02 సంచిక : 24 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Sunday, 24-05-2026 Volume :02 Issue: 24 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


# మళ్లీ పెట్రో మంట

- 8 రోజుల్లో మూడోసారి
- తాజాగా 90పైసలు పెంపు



న్యూఢిల్లీ

పెట్రోల్, డీజిల్ ధరలు శనివారం మరోసారి పెరిగాయి. ఎనిమిది రోజుల వ్యవధిలోనే ఇది మూడోసారి పెరగడం. దేశవ్యాప్తంగా, అన్ని వేరియంట్లలోనూ తాజాగా లీటరుకు సగటున 90పైసలు పెరిగింది. అంతేగాకుండా, ఉత్తర భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో కంప్రెస్డ్ నేచరుల్ గ్యాస్ (సీఎన్‌జీ) ధర ఇదే కాల వ్యవధిలో మూడోసారి కిలోకు రూపాయి చొప్పున పెరిగింది.

-మిగతా 2 లో

# బాలికలదే పై చేయి...

- 86.38 శాతం పాస్
- 79.92 శాతం అర్హత సాధించిన బాలురు
- పాలిసెట్ లో 82.94 శాతం ఉత్తీర్ణత

TG POLYCET

హైదరాబాద్

తెలంగాణ పాలిసెట్-2026 లో 82.94 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. శనివారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ లోని సాంకేతిక విద్యా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిసెట్ కన్వీనర్ శ్రీదేవసేన ఈ ఫలితాలను విడుదల చేశారు. ఎంపీసీ విభాగంలో మొత్తం 98,029 మంది పరీక్ష

-మిగతా 2 లో




## ఏఐసీసీ నాపై పూర్తి
# నమ్మకంతో ఉంది

- మీడియాకు స్వేచ్ఛ ఉంది
- ఒక ఛానెల్ ప్రచారమే నిజం కాదు
- నా పనితీరుకు తీర్పు చెప్పేది సీఎం, కార్యకర్తలే
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

హైదరాబాద్ మే 23(నేటి దర్శిని)

తనపై వస్తున్న ఆరోపణలు, పీసీసీ మార్పు ప్రచారం, పార్టీ అంతర్గత అంశాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్పందించారు. తనపై జరుగుతున్న ప్రచారాలను పెద్దగా పట్టించుకోవాలని, సరైన సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు తెలుస్తాయని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ మార్పు అంశంపై తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని పేర్కొన్నారు. తాను సరైన వ్యక్తినిని భావించినందుకే పార్టీ అధిష్ఠానం తనకు బాధ్యతలు అప్పగించిందన్నారు. ఏఐసీసీ దృష్టిలో తాను ఉత్తమ పీసీసీ చీఫ్‌గా పనిచేస్తున్నానని మహేష్ గౌడ్ తెలిపారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తన పనితీరును పలుమార్లు అభినందించారని వెల్లడించారు. తాను, ముఖ్యమంత్రి కలిసి సమన్వయంతో పనిచేయడం కొందరికి మింగుడుపడటం లేదని వ్యాఖ్యానించారు. తనపై వస్తున్న కథనాలను పెద్దగా పట్టించుకోనని, చిన్న చిన్న విషయాలపై

-మిగతా 2 లో

## టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట
# టెంపుల్ సిటీ

### రూ. 99.55 కోట్ల వ్యయంతో పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులు

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణం
- రూ. 43.80 కోట్లతో వేద పాఠశాలకు శంకుస్థాపన
- రూ. 9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణం
- రూ. 1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణం
- రూ. 1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణాలు
- రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం
- జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి వీటికి సీఎం రేవంత్ శంకుస్థాపన

2 లో

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో సంప్రదాయ వేద విద్యను బోధించే గురుకులం ఏర్పాటుకానుంది. 43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయనగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నటువంటి వేద పాఠశాల భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. మొత్తంగా 100 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. ?99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ స్వామీజీతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఈ భూమిపూజలో పాల్గొన్నారు.





2 లో

## హమ్జా అంత్యక్రియలకు పోటెత్తిన
# అగ్ర ఉగ్రవాదులు

- తుపాకులతో హాజరైన హిజ్బుల్, అల్-బదర్ అధినేతలు
- హాజరైన పాక్ గూఢచార సంస్థ ISI అధికారులు
- భారీ భద్రత నడుమ ఇస్లామాబాద్‌లో ముగిసిన అంతిమయాత్ర



2 లో

## చైనా బొగ్గు గనిలో
# భారీ పేలుడు

- 90 మంది మృతి
- ప్రమాద సమయంలో గని లోపల మొత్తం 247 మంది కార్మికులు
- గల్లంతైన వారి కోసం గాలింపు

# 16వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు




- కేంద్ర ఆర్థికశాఖ మార్గదర్శకాలు విడుదల
- తెలంగాణకు రూ. 21,517 కోట్లు..
- ఏపీకి అదనంగా రూ.7,270 కోట్లు
- ఆర్ఎల్‌బీలకు రూ.9,968 కోట్ల ఊతం
- యూఎల్‌బీలకు రూ.11,549 కోట్లు
- ఐదేండ్ల కాలపరిమితితో మంజూరు
- ఆడిట్ రిపోర్టులు ఆన్‌లైన్ చేస్తేనే నిధులు

2




## తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి
# కట్టుబడి ఉన్నాం

- మోదీ 3.0 పాలనలో అత్యధిక లబ్ది పొందుతున్న రాష్ట్రం ఏపీ
- 2 ఏళ్లలో రూ.3 లక్షల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభం
- తెలంగాణలో 12 ఏళ్లలో 12 లక్షల కేంద్ర నిధులిచ్చాం
- యుద్ధం వల్ల ఆర్థిక సంక్షోభంలో ప్రపంచం
- దేశం సుస్థిరంగా ఉండాలంటే సప్త సూత్రాలను పాటించండి
- గుంతకల్ "రోజ్ గార్ మేళా"లో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్

హైదరాబాద్ మే 23(నేటి దర్శిని)

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మోదీ 3.0 పాలనలో దక్షిణ భారత దేశంలో కేంద్రం నుండి అత్యధిక ప్రయోజనాలు పొందుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అందులో భాగంగా గత రెండేళ్లలో రూ.3 లక్షల

-మిగతా 2 లో



# జమ్మూ కాశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులున్నట్లు గుర్తింపు.

- రాజౌరి అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న హోరాహోరీ ఎన్‌కౌంటర్
- ఉగ్రవాదుల కదలికలపై నిఘా వర్గాల పక్కా సమాచారం
- పాకిస్తాన్‌కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరిక
- విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న 'ఆపరేషన్ సిందూర్'

న్యూఢిల్లీ

జమ్మూ కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు, తీవ్రవాదులకు మధ్య శనివారం కాల్పులు జరుగుతున్నాయి. రాజౌరి పరిధిలోని డోరిమల్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ సాగుతోంది. ఈ ప్రాంతంలో కనీసం ఇద్దరు ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందింది.దీంతో వారిని పట్టుకునేందుకు, అంతం చేసేందుకు భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. ఈ ప్రాంతం మొత్తాన్ని గాలిస్తున్నాయి. తీవ్రవాదుల కదలికలపై స్పష్టమైన సమాచారం అందడంతో పోలీసులు, కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. సోదాలు నిర్వహిస్తుండగా, తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. అయితే, ఇంకా ఉగ్రవాదులు చిక్కలేదు. మరోవైపు గత ఫిబ్రవరిలో ఇండియన్ ఆర్మీ ఒక ప్రకటన చేసింది.

-మిగతా 2 లో

## గోదావరి పుష్కరాలకు
# రూ.1000 కోట్లు


### జూ. కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం

- కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- తొలి విడతగా రూ. 300 కోట్ల మంజూరుకు కేబినెట్ పచ్చజెండా
- తెలంగాణలో అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్
- ఆ జిల్లాలోనే సెంటర్ల ఏర్పాటుకు కేబినెట్ పచ్చజెండా

హైదరాబాద్ మే 23(నేటి దర్శిని)

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో రెండు గంటలుగా కొనసాగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్న పలు అంశాలపై కేబినెట్ చర్చించింది. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పాఠశాలల్లో ఈ స్కీమ్ అమల్లో ఉంది. ఇప్పుడు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం

-మిగతా 2 లో




# మహానాడు పండుగలా జరపాలి



- అందరం కలిసికట్టుగా పనిచేయాలి
- ఈ నెల 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు
- క్లస్టర్ల స్థాయిలో వర్చువల్గా హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహణ
- 'స్త్రీ శక్తి మహానాడు' థీమ్తో కార్యక్రమాలు
- పార్టీ శ్రేణులను ఏకం చేసి, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని లోకేశ్ పిలుపు
- మహానాడు విజయవంతానికి ఐక్యంగా పనిచేయాలని దిశానిర్దేశం

2 లో

# మళ్లీ పెట్రో మంట

మొదటి తరువాయి

తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర 87 పైసలు పెరిగి లీటరు ధర రూ.99.51కి చేరుకోగా, డీజిల్ ధర 91పైసలు పెరిగి, లీటరుకు రూ.92.49కి చేరుకుంది. ప్రీమియం వేరియంట్ డీజిల్ ధర లీటరుకు రూ.97.81కి చేరింది. ఇక హై ఆక్టేన్ వేరియంట్‌కి చెందిన పెట్రోల్ ఎక్స్‌పి 95 ధర 87పైసలు పెరిగి లీటరు ధర రూ.106.63కి చేరుకుంది. ఇతర మెట్రోలు ముంబయి, ఢిల్లీ, చెన్నైలతో పోల్చుకుంటే కోల్‌కతాలో ఎక్కువగా ఈ పెంపు కనిపిస్తుంది. అలాగే ఇతర మెట్రోలతో పోలిస్తే చెన్నైలో పెంపు ఒక మోస్తరుగానే వుంటుంది. చెన్నైలో 82పైసలు పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.105.31కి పెరగగా, డీజిల్ ధర 87పైసలు పెరిగి లీటరు రూ.96.98కి చేరింది. తాజాగా కోల్‌కతాలో లీటరు పెట్రోల్‌కు 94పైసలు పెరిగి లీటరు రూ.110.64కి చేరుకుంది. డీజిల్ కూడా 95పైసలు పెరిగింది. లీటరు ధర రూ.97.02కి చేరుకుంది. ముంబయిలో 90పైసలు పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.108,49కి చేరుకోగా, డీజిల్ ధర 94పైసలు పెరిగి, లీటరు ధర రూ.95.02కి చేరుకుంది. ఢిల్లీలో దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిటి)లో సిఎన్‌జి ధర కిలోకు రూ.81.09కి చేరుకుంది. మే 15నుండి వరుసగా పెరుగుతున్న ధరల పెంపుతో ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు మొత్తంగా లీటరుకు రూ.4.8 చొప్పున పెరిగాయి. మొట్టమొదటసారిగా లీటరుకు మూడు రూపాయిలు చొప్పున పెరగగా, ఆ తర్వాత సగటున లీటరుకు 90పైసలు చొప్పున రెండుసార్లు మే 19, 23 తేదీల్లో పెరిగాయి. పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు ఆటంకం కలిగింది. దాంతో ముడి చమురు ధరలు బాగా పెచ్చరిల్లాయి. ఈ నేపథ్యంలో చమురు మార్కెటింగ్ కంపెనీలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది.

# బాలికలదే పై చేయి...

మొదటి తరువాయి

రాయగా 81,307 మంది, ఎంబైపీసీ విభాగంలో 79,652 మంది రాయగా 81.25 శాతం అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 52,201 మందికి గానూ 41,719 (79.92 శాతం), బాలికల్లో 45,828 మందికి గాను 39,588 (86.38 శాతం), ఎంబైపీసీ విభాగంలో బాలురు 40,554 మంది రాయగా 77.69 శాతం, బాలికల్లో 39,098 రాయగా 85.31 శాతం పాలిసెట్‌లో అర్హత సాధించారు. ఎస్సీలు 18,481 మంది, ఎస్టీలు 8,817 మంది పరీక్ష రాశారు. రెండు విభాగాల్లో వంద శాతం అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 15 మంది టాప్ ర్యాంకులు సాధించారు. వారిలో ఎనిమిది బాలురు ఉండగా, ఏడుగురు బాలికలున్నారు. ఎంబైపీసీ విభాగంలో టాప్ ర్యాంకులు సాధించిన 15 మందిలో నలుగురు బాలికలుండగా, 11 మంది బాలురున్నారు. ఎంపీసీ విభాగంలో ఓసీలు 9,771 మంది పరీక్ష రాయగా 8,185 మంది (83.77 శాతం), బీసీ-ఏలో 9,565కి గానూ 6,844మంది 71.56 శాతం, బీసీ - బీలో22,401కి గానూ 17,588 మంది 78.51 శాతం, బీసీ- సీలో 230కి గానూ 180 మంది 78.26 శాతం, బీసీ-డీలో 24,244కి గానూ 17,824 మంది 73.52 శాతం, బీసీ-ఈలో 4,520కి గానూ 3,378 మంది 74.73 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఎంబైసీలోనూ సామాజిక వర్గాల వారీగా ఓసీ, బీసీ-ఎ, బీసీ-బీ, బీసీ-సీ, బీసీ-డీ, బీసీ-ఈ వరస క్రమంలో నిలిచారు.

## ఏఐసీసీ నాపై పూర్తి
# నమ్మకంతో ఉంది

మొదటి తరువాయి

సమయం వృధా చేసుకోనని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛను తాను గౌరవిస్తానని మహేష్ గౌడ్ అన్నారు. అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు మీడియాకు ఉందని పేర్కొన్నారు. అయితే ఒక ఛానెల్ చేసే ప్రచారమే అంతిమ సత్యంగా భావించలేమన్నారు. గాంధీ భవన్ ట్రస్ట్‌కు సంబంధించిన వ్యవహారాలు ట్రస్ట్ పరిధిలోనే ఉంటాయని తెలిపారు. తన పనితీరును అంచనా వేయాల్సింది ముఖ్యమంత్రి, పార్టీ కార్యకర్తలేనని స్పష్టం చేశారు.


ఫ్యూచర్ సిటీపై ప్రశంసలు.. బీఆర్ఎస్‌పై విమర్శలు

పీసీసీ చీఫ్ చిట్‌చాట్‌లో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనా మహేష్ గౌడ్ స్పందించారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచిగా మారుతుందని అన్నారు. బీఆర్ఎస్‌కు దూరదృష్టి లేదని విమర్శించారు. హైదరాబాద్ నగర పరిధిని గత ప్రభుత్వం విస్తరించలేదని, నగరం విస్తరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీష్ రావు భావిస్తున్నారా అని ప్రశ్నించారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్ల పేర్లను ఇప్పటికే ఏఐసీసీకి పంపించామని, త్వరలో ప్రకటన ఉంటుందని చెప్పారు. కేబినెట్ విస్తరణ పూర్తిగా ముఖ్యమంత్రి పరిధిలోని అంశమని, అందులో తన పాత్ర ఉండదన్నారు.

## హమ్జా అంత్యక్రియలకు
# పోటెత్తిన అగ్ర ఉగ్రవాదులు

**న్యూఢిల్లీ,**

పుల్వామా ఉగ్ర దాడి సూత్రధారి, హిజ్బుల్ చీఫ్ హమ్జా బుర్హాన్ అంత్యక్రియలకు వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన అగ్ర నేతలు తుపాకులు చేత పట్టుకొని హాజరయ్యారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గుర్తు తెలియని దుండగులు జరిపిన దాడిలో హమ్జా బుర్హాన్ అలియాస్ అర్జుమంద్ గుల్జార్ దర్ ఇటీవల హతమయ్యాడు. ఇస్లామాబాద్‌లో శుక్రవారం అతడి అంత్యక్రియలు జరిగాయి. వీటికి హిజ్బుల్ ముజాహిద్దీన్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్, అల్-బదర్ అధినేత భక్త్ జమీన్‌ఖాన్, పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ అధికారులు, ఇతర ఉగ్ర సంస్థలకు చెందిన చోటామోటా నాయకులు హాజరైనట్టు స్థానికులు సోషల్ మీడియాలో పెట్టిన వీడియోలను బట్టి తెలుస్తున్నది. భక్త్ జమీన్‌కు రక్షణగా ఆయన చుట్టూ సాయుధులైన సెక్యూరిటీ సిబ్బంది కనిపించారు. ఈ అంతిమ యాత్రపై కూడా దాడులు జరిగే అవకాశమున్నట్టు నిఘా వర్గాలు హెచ్చరించడంతో పోలీసులను కూడా భారీగా మోహరించారు.



## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు

మొదటి తరువాయి

అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. అలాగే గోదావరి పుష్కరాల కోసం రూ. 1,000 కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సంబంధిత పనుల కోసం నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ. 300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. 2027లో జరగనున్న గోదావరి నది పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఈ గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులకు.. రూ. 1000 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగానే మొదటి విడత కింద రూ. 300 కోట్లను మంజూరు చేసేందుకు తెలంగాణ కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ క్రమంలోనే తాజాగా నిర్వహించిన ఈ కేబినెట్ భేటీలో సీఎం, మంత్రులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న 2026-2027 విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం ప్రకటించింది. అదే సమయంలో స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, పాలు కూడా అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందించడంలో భాగంగా ఈ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇక కేంద్ర ప్రభుత్వ సంస్థలైన అస్సాం రైఫిల్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సెంటర్లను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేస్తూ.. తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. ఇక తాజాగా కేబినెట్ భేటీలో పలు ఉద్యోగుల భర్తీకి కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో కొత్త పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులతోపాటు.. మరో 6 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేకాకుండా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మరో 3 పోస్టులను భర్తీ చేసేందుకు క్లియరెన్స్ ఇచ్చింది.

# టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణం
- రూ. 43.80 కోట్లతో వేద పాఠశాలకు శంకుస్థాపన
- రూ. 9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణం
- రూ. 1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణం
- రూ. 1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణాలు
- రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హోల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం
- జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి వీటికి సీఎం రేవంత్ శంకుస్థాపన



తెలంగాణ బ్యూరో ప్రతినిధి :

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం భూమిపూజ చేశారు. వేద పాఠశాలతో పాటు టెంపుల్ సిటీ పరిధిలో రూ. 99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ఈ సందర్భంగా కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, అజ్మీరా లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రూ. 43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ వేద పాఠశాలలో సాంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్యను అందించనున్నారు. ఈ సముదాయంలో హోమాలు, యాగాలు నిర్వహించడానికి ప్రత్యేక శాలలతో పాటు ఒక గోశాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. వేద పాఠశాలకు భూమిపూజతో పాటు రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హోల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం, కొండపై స్వామివారి నిత్య కల్యాణాల నిర్వహణ కోసం రూ. 9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం, భక్తుల సౌకర్యార్థం వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ. 1.41 కోట్లతో రక్షణ పైకప్పు (కానోపీ) నిర్మాణం, రథశాల వైపు వాయువ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

# చైనా బొగ్గు గనిలో భారీ పేలుడు

- 90 మంది మృతి
- ప్రమాద సమయంలో గని లోపల మొత్తం 247 మంది కార్మికులు
- గల్లంతైన వారి కోసం గాలింపు



**బీజింగ్**

చైనాలోని ఓ బొగ్గు గనిలో సంభవించిన భారీ పేలుడులో సుమారు 90 మంది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారు. పలువురు ఇంకా భూగర్భంలో చిక్కుకుపోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇటీవల కాలంలో చైనాలో జరిగిన అతిపెద్ద పారిశ్రామిక ప్రమాదాల్లో ఇదొకటిగా ప్రభుత్వ మీడియా పేర్కొంది. షాన్సీ ప్రావిన్స్‌లోని టోంగౌజ్ గ్రూప్‌కు చెందిన లియుషెన్యు బొగ్గు గనిలో శుక్రవారం(మే 22వ తేదీ) రాత్రి 7:29 గంటలకు ఈ పేలుడు సంభవించినట్లు ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 247 మంది కార్మికులు భూగర్భంలో పనిచేస్తున్నట్టు సమాచారం. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ బృందాలు, అక్కడ చిక్కుకున్న చాలా మందిని శనివారం ఉదయం నాటికి సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. అయినప్పటికీ 82 మంది మృతిచెందినట్లు అధికారులు ధ్రువీకరించారు.

**గల్లంతైన వారి కోసం గాలింపు**

ఇదిలా ఉండగా మరో తొమ్మిది మంది కార్మికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయని అన్నారు. సంఘటనా స్థలంలో భారీ సంఖ్యలో అంబులెన్స్‌లు, రెస్క్యూ సిబ్బంది మోహరించాయి. ప్రభుత్వ ప్రసార సంస్థ, సీసీటీవీ విడుదల చేసిన వీడియోల్లో హెల్మెట్లు ధరించిన సహాయక సిబ్బంది స్ట్రెచర్లపై గాయపడిన వారిని తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. గాయపడిన వారికి అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆదేశాలు**

ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. "అన్ని ప్రాంతాలు, విభాగాలు ఈ ప్రమాదం నుంచి గుణపాఠం నేర్చుకోవాలి. పని ప్రదేశ భద్రత విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి భారీ ప్రమాదాలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మొదటి తరువాయి

కోట్లకుపైగా ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు చేసుకోగలిగామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉండటంవల్లే ఇది సాధ్యమైందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం సైతం మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లలో 12 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. తెలంగాణ ప్రజలు సైతం డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలనే భావనలో ఉన్నారని తెలిపారు. అమెరికా ఇరాన్, రష్యా ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచమంతా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. భారత్ దేశం సుస్థిరంగా ఉండాలంటే ప్రధాని నరేంద్రమోదీ సూచించిన సప్తసూత్రాలను కచ్చితంగా పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సప్తసూత్రాలను పాటిస్తూ మీరే చేసే పొదుపు... ఈ దేశ భవితకు మలుపు కానుంది అన్నారు. శనివారం మాట్లాడినట్లుంది అనిపిస్తుంది అనంతపురం జిల్లా గుంతకల్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన "రోజ్ గార్" మేళా కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం శివప్రసాద్, డీపీఓ హెచ్.ఎల్.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా 120 మంది అభ్యర్థులు ఉద్యోగ అపాయింట్ మెంట్ లెటర్లను అందుకున్నారన్నారు. కష్టపడి చదివి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులందరికీ నా హృదయ పూర్వక అభినందనలు. మీ తల్లి దండ్రులకు ప్రత్యేక అభినందనలు. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలనే లక్ష్యంతో 2022 అక్టోబర్ 22న రోజ్ గార్ మేళాను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించినప్పుడు ఇది జరిగే పనేనా? అని చాలా మంది హేళన చేశారు. వాటిని పట్టించుకోకుండా అవినీతి, పైరవీలు, దళారుల ప్రమేయం లేకుండా ఇప్పటి వరకు 11 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన మోదీ కమిట్ మెంట్ కు ఇది నిదర్శనం. 19వ విడత ద్వారా 47 ప్రాంతాల్లో రోజ్ గార్ మేళా ద్వారా మరో 51 వేల ఉద్యోగాల భర్తీ చేసి నియామక పత్రాలు అందించాం. గతంలో లీకేజీలు, పైరవీలు, దళారుల ప్రమేయంతో ఉద్యోగాలిచ్చేవారు. మోదీ పాలనలో అలాంటివి తావులేకుండా మెరిట్ ఆధారంగా అర్హులైన వారినే ఉద్యోగాలు వరిస్తున్నాయి. ఈ రోజ్ గార్ మేళాను నిరంతరం కొనసాగించాలని భావిస్తున్నాం. కర్మయోగి పోర్టల్ ద్వారా కొత్తగా ఉద్యోగాలు పొందిన వారంతా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరుతున్నా భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ గా చేయాలనే సంకల్పంతో మోదీ కష్టపడి పనిచేస్తున్నారు.

# మహానాడు పండుగలా జరపాలి

**అమరావతి**



తెలుగుదేశం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడును ఈసారి క్లస్టర్ స్థాయిలో ఒక పండుగ వాతావరణంలో, కలిసికట్టుగా విజయవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. హైబ్రిడ్ విధానంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు సన్నాహకాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ ఇంచార్జ్‌లతో ఆయన ఆన్లైన్ ద్వారా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈసారి మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు' అనే థీమ్తో నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

**హైబ్రిడ్ విధానంలో నిర్వహణ**

వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో అత్యంత ఘనంగా మూడు రోజుల పాటు నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునకు స్పందించి, ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడును రెండురోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు లోకేశ్ వివరించారు. దీని ప్రకారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో పొలిట్బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ కేంద్రాల్లో వర్చువల్గా మహానాడు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి క్లస్టర్ కేంద్రంలో ఎల్ఈడీ టీవీ, స్పీకర్లు వంటి సాంకేతిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

# 16వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు

**కేంద్ర ఆర్థికశాఖ మార్గదర్శకాలు విడుదల**
**తెలంగాణకు రూ. 21,517 కోట్లు..**
**ఏపీకి అదనంగా రూ.7,270 కోట్లు**
**ఆర్ఎల్‌బీలకు రూ.9,968 కోట్ల ఊతం**
**యూఎల్‌బీలకు రూ.11,549 కోట్లు**
**ఐదేండ్ల కాలపరిమితితో మంజూరు**
**ఆడిట్ రిపోర్టులు ఆన్‌లైన్ చేస్తేనే నిధులు**





**హైదరాబాద్,**

దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల రూపురేఖలను మార్చేందుకు 16వ ఆర్థిక సంఘం నిధులను ప్రకటించింది. 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేండ్ల కాలానికి తెలంగాణకు రూ.21,517 కోట్లు కేటాయించింది. ఏపీకి మనకంటే రూ.7,270 కోట్లు అదనంగా అంటే రూ.28,787 కోట్లు ప్రకటించింది. అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.4,35,236 కోట్ల గ్రాంట్లను సిఫార్సు చేస్తూ కేంద్ర ఆర్థికశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ స్థానిక సంస్థల(ఆర్ఎల్‌బీ)కు రాష్ట్రానికి కేటాయించిన మొత్తం నిధుల్లో రూ.7,974 కోట్లు 'బేసిక్ గ్రాంట్స్'గా, మిగిలిన రూ.1,994 కోట్లను 'పెర్ఫార్మెన్స్ గ్రాంట్స్' కింద కేంద్రం ప్రతిపాదించింది. ఏపీకి ఈ ఐదేండ్లలో మొత్తం రూ.16,628 కోట్లు (బేసిక్ గ్రాంట్స్ రూ.13,302 కోట్లు, పెర్ఫార్మెన్స్ కింద 3,326 కోట్లు) లభించాయితెలంగాణ కంటే ఏపీకి అదనంగా రూ.6,660 కోట్లు కేటాయించడం గమనార్హం. తెలంగాణ పట్టణ స్థానిక సంస్థల(యూఎల్‌బీ)కు బేసిక్ గ్రాంట్స్‌గా రూ.9,239 కోట్లు, పెర్ఫార్మెన్స్ గ్రాంట్స్‌గా రూ.2,310 కోట్లు మొత్తంగా రూ.11,549 కోట్లు సిఫార్సు చేశారు. ఏపీకి బేసిక్ గ్రాంట్స్ రూ.9,727 కోట్లు, పెర్ఫార్మెన్స్ కింద రూ.2,432 కోట్లు, మొత్తంగా రూ.12,159 కోట్లు కేటాయించారు. ఇలా ఆర్ఎల్‌బీ, యూఎల్‌బీలకు కలిపి తెలంగాణ కంటే ఏపీకి అదనంగా రూ.7,270 కోట్లు కేటాయించారు. విపత్తు నిర్వహణ నిధుల విషయంలో కూడా కేంద్రం తెలంగాణ పై వివక్ష చూపించింది. ఏపీకి రూ.6,125 కోట్లు కేటాయిస్తే, తెలంగాణకు మాత్రం కేవలం రూ.2,774 కోట్లే ప్రతిపాదించింది.

## జమ్మూ కాశ్మీర్‌లో ఇద్దరు
# ఉగ్రవాదులున్నట్లు గుర్తింపు.

మొదటి తరువాయి



326 రోజులు శ్రమించిన తర్వాత కిష్త్వార్ ప్రాంతంలో తీవ్రవాద నెట్‌వర్క్‌ను అంతం చేశామని ప్రకటించింది. ఇటీవల ఇండియన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. ఒకవేళ పాకిస్తాన్ ఇలాగే ఉగ్రవాదుల్ని పెంచుకుంటూ, ఇండియాపైకి పంపిస్తే భారత్ తీవ్రంగా స్పందిస్తుందన్నారు. ప్రపంచ పటంలో ఉండాలో లేదో పాకిస్తాన్ తేల్చుకోవాలన్నారు. పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తైంది. గత ఏడాది మే 7న ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు






- నిర్వహించిన జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్
- రికార్డుల నిర్వహణ, సైబర్ నేరాల నియంత్రణ, మహిళలు--బాలికల భద్రతపై ప్రత్యేక ఆదేశాలు
- హెల్మెట్ లేకుండా పోలీస్ స్టేషన్‌లోకి సిబ్బంది రావద్దు సీసీ కెమెరాల పర్యవేక్షణపై ఎస్పీ ఆదేశాలు




**మిడ్జిల్, మే 23, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, ఎఫ్ఐఆర్ నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల వివరాలు, రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం, ఆన్లైన్ అప్డేట్స్ తదితర అంశాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ప్రతి కేసును సమయానుకూలంగా ఆన్లైన్‌లో నమోదు చేసి సీసీటీఎన్ఎస్ నందు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ పద్ధతి, సిబ్బంది క్రమశిక్షణ, ప్రజలతో వ్యవహరించే తీరు వంటి అంశాలను కూడా సమగ్రంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే దరఖాస్తుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.తనిఖీలలో భాగంగా టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును జిల్లా ఎస్పీ గారు పరిశీలించారు. సీసీ కెమెరాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా నిరంతరం తనిఖీ చేయాలని, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, ట్రాఫిక్ పర్యవేక్షణ, రాత్రి సమయంలో భద్రతా చర్యల కోసం సీసీ కెమెరాలను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. అలాగే పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బంది వాహనాలను పరిశీలించి హెల్మెట్లు ఉన్నాయా లేదా జిల్లా ఎస్పీ గారు స్వయంగా తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గుతుందని, తీవ్ర గాయాల నుండి రక్షణ లభిస్తుందని తెలిపారు. పోలీస్ సిబ్బందే ప్రజలకు ఆదర్శంగా ఉండాలని సూచిస్తూ, ఇకపై హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వచ్చే సిబ్బందిని పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, మహిళలు మరియు బాలికల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి వెంటనే స్పందించాలని సూచించారు.
అనంతరం స్టేషన్ సిబ్బందితో జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా వ్యక్తిగత సమస్యలు ఉన్న సిబ్బంది ప్రతి శనివారం తన కార్యాలయానికి వచ్చి నేరుగా కలవవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్ , సబ్ ఇన్స్పెక్టర్ విజయభాస్కర్, నరేందర్ రెడ్డి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రామ్మునంతల లో"పీఎం జన్ మన్ "పథకంపై అవగాహన సదస్సు




**ఆమనగల్లు,మే23(నేటి దర్శిని):**
ఆమనగల్లు మండల పరిధిలోని రామ్మునంతల గ్రామపంచాయతీలో శనివారం రామ్మునంతల గ్రామ సర్పంచ్ వత్యావత్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం గిరిజన తెగల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన "ప్రధానమంత్రి జంజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్"(పిఎం జన్ మన్) అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ సర్పంచ్ వి.శ్రీను నాయక్ మరియు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి సంబంధిత అధికారులు మాట్లాడుతూ ఈ సంక్షేమ పథకం ద్వారా గిరిజనులకు పక్కాఇల్లు, త్రాగునీరు, విద్యుత్,రహదారులు,మరియు మెరుగైన జీవనోపాధి వంటి 11 మౌలిక వసతులపై అవగాహన కార్యక్రమం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేశ్వరి మోహన్,వార్డు సభ్యులు ధనరాజ్,శంకర్,మాజీ ఎంపీటీసీ కమల,మాజీ సర్పంచ్ హోమ్లు నాయక్, కార్యదర్శి బాల మల్లేష్, జిపిఓ రమేష్,అంగన్వాడీ టీచర్స్,ఆశా వర్కర్స్,మాజీ వార్డు సభ్యులు,కృష్ణ, గ్రామ నాయకులు,మరియు గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి అక్రమ క్వారీలో 3 హిటాచీలు సీజ్ చేసిన మండల రెవెన్యూ అధికారులు







**మిడ్జిల్, మే 23, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ గైరాన్ భూముల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై మన తెలంగాణ దినపత్రిక తో పాటు వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు మండల అధికారులు స్పందించారు . సర్వే నెంబర్లు 80, 88, 85, 97 తో పాటు నది నాలా పరిధిలోని భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై స్పందించిన మండల తహసిల్దార్ రాఘవేందర్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్, ఆర్ఐ అంబిక శనివారం తనిఖీలు నిర్వహించారు. అక్రమ తవ్వకాలకు ఉపయోగిస్తున్న 3 హిటాచీలను అధికారులు సీజ్ చేశారు. రైతులను తుపాకులతో బెదిరిస్తూ అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారని ఆరోపణలు కూడా వెలువడ్డాయి.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు పల్లె తిరుపతి మాట్లాడుతూ అక్రమ ఇసుక మాఫియా పై ధైర్యంగా చర్యలు తీసుకున్న అధికారులకు బిజెపి తరపున, మండల రైతాంగం పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అధికారులు ఇదేవిధంగా నీతి నిజాయితీతో పనిచేస్తూ మండల ప్రజలకు సేవలు అందించి మండల ప్రజల అభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు....

# బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

**మిడ్జిల్, మే 23, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):**
రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, పండుగను ప్రశాంతమైన, సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించడం జరిగింది.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ గారి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం మత పెద్దలు, ఇమామ్‌లు, మసీదు కమిటీ సభ్యులు, శాంతి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, బక్రీద్ పండుగను పరస్పర గౌరవం, సోదరభావం, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్ శాఖ తరఫున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈద్గాల వద్ద బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని





పేర్కొన్నారు.సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు, పుకార్లు వ్యాప్తి చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గారు హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, ఏవైనా అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.మత పెద్దలు కూడా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

**జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతి కమిటీ సమావేశాలు**
జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా ఇదివరకే శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముస్లిం మత పెద్దలు, వ్యాపార వర్గాల ప్రతినిధులు, యువకులతో సమావేశం నిర్వహించి పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని పోలీసులు కోరారు. అలాగే జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన సమావేశంలో స్థానిక మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొని పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పరస్పర సహకారం అందించాలని నిర్ణయించారు. అదేవిధంగా జిల్లాలోని ఇతర మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా పోలీస్ అధికారులు స్థానిక మత పెద్దలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలతో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ చీదీ రత్నం, ఖ్వాజా వెంకటేశ్వర్లు, DCRB DSP రమణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మొతిరాం, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్ రూరల్ సిఐ గాంధీ నాయక్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# సకాలంలో ధాన్యం కొనుగోలు చేయలేకపోతే రైతులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరిక



**మిడ్జిల్, మే 23, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండల పరిసర ప్రాంతాల్లో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో అధికారులు రైస్ మిల్లర్లు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు40 కిలోల బస్తాకు బదులు 42 కిలోల వరకు తూకం వేస్తూ రైతులను దోచుకుంటున్నారని తెలిపారు ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ కావడం లేదని విమర్శించారు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతి ఏటా కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోళ్లకు అవసరమైన నిధులు విడుదల చేస్తుందని పేర్కొన్నారు ఐకెపి ప్యాక్స్ కేంద్రాల ద్వారా కొనుగోలు నిర్వహించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనాని గుర్తు చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అధికారులు స్పందించి వెంటనే వరి కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు,దీనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వాసుదేవ్, ఆంజనేయులు, వెంకటరెడ్డి, వినోద్,రాజు, రాహుల్ నాయక్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు...

# శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలి

- ఆలయ దక్షిణ మండప నిర్మాణానికి విరాళాలు అందిస్తున్న గ్రామ ప్రజలు, యువతను అభినందించిన సర్పంచ్

**చింతపల్లి, మే 23 (నేటి దర్శిని):**
చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ దక్షిణ మండపం నిర్మాణానికి గ్రామ ప్రజలు, యువత స్వచ్ఛందంగా విరాళాలు అందించడం అభినందనీయమని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్ అన్నారు.ఈ సందర్భంగా కలకొండ లక్ష్మి మల్లేశం రూ.1,00,116/- (ఒక లక్ష నూట పదహారు రూపాయలు), కుర్మేడు గ్రామానికి



చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పి.ఏ.సి.యస్ డైరెక్టర్ అండేకార్ అశోక్ రూ.51,000/- (యాభై ఒక్క వేల రూపాయలు) విరాళంగా అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ దక్షిణ మండప నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఆలయ అభివృద్ధికి గ్రామ ప్రజలు, యువత ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు.అలాగే శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

## సంపాదకీయం

### రిజర్వేషన్లతో కొందరికే లబ్ది !




స్వాతంత్ర్యం లభించి 80ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపి అయితే చాలు..జీవితాంతం సుఖంగా బతికేయవచ్చన పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే పురుగుల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛ వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమూలో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది. వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రం ఎలా పరిణమించిందో చూశాం. అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు..ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోలల్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు...నిరుద్యోగం కావచ్చు...ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అంఉదకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమిలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయ పడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లెక్కాలని చూస్తున్నారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా ర ఇజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగులు సాధించిన ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా తమ పిల్లకు రిజర్వేషన్లు పొందుతున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసాలపైనా వ్యతిరేకత వస్తుంది. ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించడం సరికాదన్నారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ది పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపిలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేక పోతున్నారు. దీనిపై దేశవ్యాప్తం చర్చ జరగాలి. కాక్రోచ్ జనతాపార్టీ కూడా చర్చించాలి. వెనకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటి వారు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినందున క్రీమీలేయర్ కిందకు వస్తారని.. రిజర్వేషన్ వర్తించదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

# రాజ్యసభ ఎంట్రీకి సిద్ధమైన టీవీకే..

### దక్కనున్న ఒక స్థానం



న్యూఢిల్లీ మే 23(నేటి దర్శిని)
తమిళనాడులో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే, రాజ్యసభలో ప్రవేశానికి సిద్ధమైంది. ఆ పార్టీ ఒక స్థానం దక్కించుకోనున్నది. రాజ్యసభలోని 26 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రతి రెండేళ్లకు ఖాళీ అయ్యే స్థానాలను భర్తీ చేయనున్నారు.కాగా, ఈ 26 స్థానాలకు సంబంధించి 12 రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటకలో చెరో నాలుగు స్థానాలకు, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో చెరో మూడు స్థానాలకు, జార్ఖండ్‌లో రెండు స్థానాలకు, మణిపూర్, మేఘాలయ, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్‌లో ఒక్కో స్థానానికి జూన్ 18న పోలింగ్ జరుగనున్నది. అలాగే మహారాష్ట్ర, తమిళనాడులోని చెరొక రాజ్యసభ స్థానాలకు అదే రోజున ఉప ఎన్నికలు జరుగనున్నాయి. మరోవైపు ప్రస్తుతం రాజ్యసభ ఎన్నికలు జరుగనున్న 26 స్థానాల్లో ఎన్డీయే 18, కాంగ్రెస్ 4, వైఎస్సార్ కాంగ్రెస్ 3, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఒక స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే ఈ ఎన్నికల తర్వాత ఎన్డీయే ఒక స్థానాన్ని కోల్పోనున్నది. దీంతో దాని సంఖ్య 17కు తగ్గుతుందని అంచనా. అదే సమయంలో కాంగ్రెస్ స్థానాల సంఖ్య 4 నుంచి 5కు పెరుగవచ్చని తెలుస్తున్నది. జేఎంఎం కూడా రెండు స్థానాలను కైవసం చేసుకోనున్నది. అలాగే తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే కూడా రాజ్యసభలో అడుగుపెట్టనున్నది. ఆ పార్టీ ఒక స్థానాన్ని గెలుచుకోనున్నది. మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ అజిత్ పవర్ వర్గం కూడా ఒక స్థానాన్ని గెలుచుకుంటుందని అంచనా. ఈ రెండు స్థానాలకే ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల నిర్దిష్ట పదవీకాలం కేవలం రెండేళ్లు మాత్రమే.

## రష్యా సైన్యంలోని 49 మంది

# భారతీయులు మృతి..

### సుప్రీంకోర్టుకు చెప్పిన కేంద్రం



న్యూఢిల్లీ మే 23(నేటి దర్శిని)
రష్యా సైనిక దళంలో పనిచేస్తున్న 49 మంది భారతీయులు.. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో మృతిచెందినట్లు సుప్రీంకోర్టు కు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రష్యా దళంలో మొత్తం 217 మంది భారతీయులు ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిపై ఓ నివేదికను సుప్రీంకోర్టుకు ప్రభుత్వం అందజేసింది. ఆ నివేదిక ప్రకారం.. రష్యన్ ఆర్మీలో చేస్తున్న సుమారు 139 మంది భారతీయులను కాంట్రాక్టు నుంచి తప్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రష్యా, ఉక్రెయిన్ వార్‌లో 49 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆ రిపోర్టులో పేర్కొన్నారు.రష్యా వైపు ఆరుగురు భారతీయ సైనికులు మిస్సింగ్‌లో ఉన్నారు. మరో 23 మంది ఎక్కడ ఉన్నారో స్పష్టంగా తెలియదు. మాస్కోలో ఉన్న భారతీయ ఎంబసీ వారి కోసం అన్వేషణ కొనసాగిస్తుందని ఆ రిపోర్టులో చెప్పారు. విదేశాంగ శాఖ సమాచారం ప్రకారం.. 217 మంది భారతీయులు.. రష్యా సైనిక దళంలో చేరినట్లు తెలుస్తోంది. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని ఓ పిటీషనర్ కోర్టులో కోరారు. రష్యా 26 మంది భారతీయుల్ని తమ ఆధీనంలో ఉంచుకుందని, వారిని ఉక్రెయిన్‌తో వార్‌లో పోరాడేలా వత్తిడి చేస్తోందని, వారిని ఎలాగైన భారత్‌కు తీసుకురావాలన్న డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో దాఖలైన పిటీషన్‌పై ప్రభుత్వం స్పందించింది. సుమారు 21 మంది బాధిత కుటుంబీకుల డీఎన్ఏ శ్యాంపిళ్లను రష్యా అధికారులకు పంపినట్లు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి.. సీజే సూర్యకాంత్‌కు తెలిపారు.

## కనిపించని ఆయుధాలు దేశంపై రహస్యంగా

# ప్రమాదకరమైన దాడి చేస్తున్నాయి



న్యూఢిల్లీ మే 23(నేటి దర్శిని)
సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ శనివారం బిజెపిపై, ఆర్ఎస్ఎస్‌పై ఎదురుదాడి చేశారు. కొన్ని కనిపించని (అదృశ్య) ఆయుధాలు సమాజంపై, దాని సామరస్యంపై రహస్యంగా తీవ్రమైన ప్రమాదకరమైన దాడి చేస్తున్నాయి అని పరోక్షంగా ఆర్ఎస్ఎస్‌నుద్దేశించి అఖిలేష్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, బిజెపి నేతలు, వారి అనుచరుల ఇళ్లు, షాపులు, ఆఫీసులు, సంస్థల వంటి ఆస్తుల చట్టబద్ధతను తనిఖీ చేయాలని న్యాయవాదులు అడుతున్నారని అఖిలేస్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'బిజెపి, వారి అనుచరులు చేపట్టిన నిర్మాణాలు, కార్యక్రమాలు, అన్నిప్రాంతాల నుంచి సేకరించిన విరాళాలు, నిధులపై లెక్కలు అడిగి ఆడిట్ నిర్వహించాలి. అసలెవరో తెలియని వ్యక్తులు భూమిని ఎవరెవరి పేరో తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు? ఈ ఆస్తులు బినామీ కాకుండా ఎలా ఉంటాయి? వీటికి సంబంధించిన చట్టపరమైన అంశాలపై ప్రజలు కూడా అడుగుతున్నారు అని అఖిలేష్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రశ్నించారు. అలాగే రహస్య కార్యకలాపాలలో పాల్గొన్న బిజెపి అనుచరులు నిర్మించిన నిర్మాణాలను కార్యాలయాలు అనాలా లేక అడ్డాలు అనాలా అని యాదవ్ ప్రశ్నించారు. నిజమైన ఆయుధాలకు లైసెన్సులు అవసరం. కానీ ఇక్కడ కనిపించని ఆయుధాలు కూడా ఉన్నాయి అని ఆయన ఎత్తిచూపారు. అఖిలేష్ యాదవ్ నేరుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పేరును ప్రస్తావించకుండా ఈ 'సంఘీ సాథీ' సహచరుల ఖర్చులను ఎవరు భరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ 'స్వదేశీ సంఘీ-సాథీ' అని పిలవబడే వారు విదేశీ పర్యటనలకు ఎందుకు వెళ్తారు? వలసవాద కాలం నుండి, ఈ 'సంఘీ-సాథీ'లు ఎవరి కీలుబొమ్మలుగా ఉన్నారు? ఈ 'సంఘీ-సాథీ'ల చరిత్ర గూఢచర్యంతో ఎందుకు ముడిపడి ఉంది? ఈ 'సంఘీ-సాథీ'లు సామాజిక సామరస్యాన్ని ఎందుకు దెబ్బతీస్తున్నారు? "ఇప్పుడు, ఏ కొత్త కుట్ర కింద ఈ 'సంఘీ-సాథీ'లు 'మానసిక గౌరవం'పై లాఠీలతో దాడి చేస్తున్నారు?" అని న్యాయవాదులు కూడా ప్రశ్నిస్తున్నారు అని అఖిలేష్ ఎక్స్ పోస్టులో బిజెపిని నిలదీశారు.

## అదానీ ప్రాజెక్టు కోసం

# 6 లక్షల చెట్లు బలి!

- జైరామ్ రమేశ్ ఆందోళన



న్యూఢిల్లీ మే 23(నేటి దర్శిని)
మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీ జిల్లాలో అదానీ గ్రూపునకు చెందిన బొగ్గు తవ్వకం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల సున్నితమైన అటవీ భూములకు ముప్పు కలిగిస్తుందని, దీని వల్ల 6 లక్షలకు పైగా చెట్లను నరికి వేయవచ్చని ఆయన ఆరోపించారు. బొగ్గు తవ్వకం కార్యకలాపాల కోసం అదానీ పవర్ అనుబంధ సంస్థ మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్‌కు కేంద్ర పర్యావరణ శాఖ 2025 మేలో ఇచ్చిన అనుమతిని రమేశ్ ప్రస్తావించారు.'ఈ ప్రాంతం సుమారు 7,000 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. మైనింగ్ కోసం కేటాయించిన నో-గో జోన్‌లో భాగంగా పరిగణించారు. ఈ ప్రాజెక్టు కింద 6 లక్షలకు పైగా చెట్లను నరికివేయనున్నారు'

## ట్రంప్ కూతురు

# హత్యకు కుట్ర!

- ఇరాన్ ఉగ్రవాది అరెస్టు



న్యూఢిల్లీ మే 23(నేటి దర్శిని)
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకాను హత్య చేయడానికి పన్నిన కుట్ర బయటపడింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) శిక్షణ పొందిన ఒక ఉగ్రవాది ఈ కుట్ర పన్నినట్లు ది న్యూయార్క్ పోస్ట్ కథనం పేర్కొంది. మహమ్మద్ బాఖర్ సాద్ దావూద్ అల్-సాది అనే ఆ ఉగ్రవాది అమెరికా దాడుల్లో తన గురువు మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నట్లు పత్రిక పేర్కొంది.ఇరాన్ సైనికాధిపతి ఖాసెమ్ సులేమానీని హతమార్చినందుకు ప్రతీకారంగా ఇవాంకాను హత్యచేయాలని అల్-సాది(32) ప్రతిజ్ఞ చేశాడు. 2021లో ఇవాంకా, ఆమె భర్త జారెడ్ కుష్నర్ నివసిస్తున్న భవనం మ్యాప్ చిత్రాన్ని అల్-సాది ఎక్స్‌లో పోస్టు చేశాడని అధికారులు తెలిపారు. ప్రతీకారం తీర్చుకునే సమయం వస్తున్నది అనే హెచ్చరికనూ పేర్కొన్నాడని వెల్లడించారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకుడు కుక్కునూరు విజయ భాస్కర్ రెడ్డి



**మిడ్జిల్ మే 23 (నేటి దర్శిని ప్రతినిధి):** మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుక్కునూరు విజయ భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తెల్లవారుజామున తిరుమలలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సర్వేజనా సుఖినో భవంతు" అనే సంకల్పంతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, ఆత్మీయులు, ప్రజలందరిపై శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. దర్శనం అనంతరం ఆలయ వేద పండితులు ఆశీర్వచనం అందించగా, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా

- తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి




**ఖైరతాబాద్, మే 23 (నేటి దర్శిని):** జంట నగరాల్లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద ఎల్బీనగర్ ఎమ్మెల్యే శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పార్టీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గంలో దాదాపు రెండు నెలలుగా తీవ్రమైన మంచినీటి సమస్య కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరానికి రోజుకు 750 ఎంజీడీల నీటి అవసరం ఉండగా, ప్రస్తుతం కేవలం 550 ఎంజీడీలే సరఫరా అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం రోజుకు 12 వేల ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని చెప్పడం, పైప్‌లైన్ ద్వారా సరైన సరఫరా జరగడం లేదనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నీటి సరఫరా మెరుగుపడకపోతే ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జల సంచాయ్-జన్ భాగీదారి" సదస్సు విజయవంతం...



**తిరుమలగిరి,మే 23 (నేటి దర్శిని):** తిరుమలగిరి సాగర్ మండలంలోని ఎల్లాపురం గ్రామంలో "జల సంచాయ్ – జన్ భాగీదారి" జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్యం మరియు నీటి సంరక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీడీడీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎంపీడీవో మరియు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా నిల్వ చేసేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ద్వారా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, ప్రతి కుటుంబం మరుగుదొడ్లను వినియోగించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను ఎల్లాపురం, రంగిండ్ల, తిరుమలగిరి, అల్వాల్ గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు "మన నీరు – మన బాధ్యత" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# ప్రజల ప్రాణ భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్
- జిల్లాలోని 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృత వాహన తనిఖీలు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు
- డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తప్పవు : జిల్లా ఎస్పీ హెచ్చరిక



**మిడ్జిల్, మే 23 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం శుక్రవారం రాత్రి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించడం జరిగినది. జిల్లాలోని 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు మరియు చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కార్ డ్రైవర్లు మరియు ప్రయాణికులు సీట్ బెల్ట్ వినియోగించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కేవలం కొన్ని నిమిషాల నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో మొత్తం 552 ద్విచక్ర వాహనాలు, 378 కార్లు మరియు ఆటోలను తనిఖీ చేయడం జరిగింది. నిబంధనలు ఉల్లంఘించిన 13 వాహనాలను సీజ్ చేయగా, 64 ఈ-చలాన్లు జారీ చేయడం జరిగింది. అదనంగా 12 ఈ-పెట్టి కేసులు మరియు 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగినది. అలాగే పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రమాద రహిత మహబూబ్‌నగర్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.



## సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేయాలి

- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బలరాం....



**ఆమనగల్లు,మే23(నేటి దర్శిని):** ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళికలో భాగంగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని శనివారం ఆమనగల్లు రైతు వేదికలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ బలరాం మాట్లాడుతూ పంట మార్పిడి ద్వారానే రైతులకు అధిక నికరాదాయం పొందగలరని వివరించారు. వ్యవసాయంలో రసాయనిక పురుగుమందుల వాడకం తగ్గించి, సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని తద్వారా నాణ్యమైన పంట దిగుబడులను మరియు అధిక మార్కెట్ ధరలు పొందాలని సూచించారు. పచ్చి రొట్టె పైర్లు, జీవన ఎరువుల వినియోగం పెంచుకొని యూరియా వాడకాన్ని తగ్గించాలని తద్వారా చీడపీడల ఉధృతిని తగ్గించుకోవచ్చని, భూసార పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణ సాధ్యమవుతుందని వివరించారు. పత్తి పంటను ఎక్కువ రోజులు చేనుమీద ఉంచకుండా పత్తి కట్టలను నెలలో కలియ దున్నుకొని ఇతర ఆరుతడి పంటలైన మొక్కజొన్న,నువ్వులు సాగు చేసుకోవాలన్నారు. వరి పంటలో సిఫారసు చేసిన సన్నగింజ రకాలు తెలంగాణ సోనా కేఎన్ఎం 1638, డబ్ల్యూజిఎల్ 962 వంటి అధిక దిగుబడి చీడపీడలు తట్టుకునే రకాలు సాగు చేసుకోవాలని నేరుగా వెదజల్లే విధానం మరియు ఆరుతడి పద్ధతిలో సాగు వంటి మేలైన యాజమాన్య విధానాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ తాళ్ల రవీందర్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్,వ్యవసాయ విస్తరణ అధికారులు మీనాక్షి ,బాలకృష్ణ భూదేవి,నికిత,మరియు అభ్యుదయ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## గట్టు ఇప్పలపల్లి గ్రామంలో తక్షణమే వడ్లు మరియు మక్కలు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



**తలకొండపల్లి, మే 23, (నేటి దర్శిని ప్రతినిధి):** తలకొండపల్లి మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో పిఎసిఎస్ క్లస్టర్ పరిధిలో వడ్లు మరియు మక్కలు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ గ్రామ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న గట్టు ఇప్పలపల్లి పిఎసిఎస్ పరిధిలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు దీనివల్ల రైతులు చాలా నష్టపోతున్నారు పండించిన పంటను అమ్ముకోలేని స్థితిలో దళారుల చేతిలో మోసపోవడం జరుగుతుంది. ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి లేక ప్రైవేటు వ్యక్తులకు ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించడం జరుగుతుంది. దీనిపై బిఆర్ఎస్ నాయకులు ఎన్నోసార్లు ఏవోకి, సంబంధిత జిల్లా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన కూడా ఎటువంటి స్పందన లభించడం లేదు గతంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి స్థానిక శాసనసభ్యులు జయపాల్ యాదవ్ సహకారంతో గట్టు ఇప్పలపల్లి గ్రామంలో ధాన్య కొనుగోలు కేంద్రాన్ని విజయవంతంగా కొనసాగించడం జరిగింది,గట్టు ఇప్పలపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రద్దు చేశారు, ఇప్పటికైనా స్థానిక అధికారులు అధికార పార్టీ నాయకులు బుద్ధి తెచ్చుకొని గట్టు ఇప్పలపల్లిలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం, లేనిపక్షంలో మండల కేంద్రంలో రాబోయే మూడు రోజుల్లో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించడం జరిగింది. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి రైతుల పట్ల శ్రద్ధ తీసుకొని వెంబడే చర్య తీసుకోవాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో గట్టు ఇప్పలపల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు రైతులు పాల్గొనడం జరిగింది.

# గోషామహల్‌లో అక్రమ నిర్మాణాల రాజ్యం

- అనుమతులు మించి అంతస్తులు, అక్రమ సెల్లార్లతో కోట్ల దందా
- నోటీసులు ఇవ్వరు కూల్చివేతలు చేయరు ఓన్లీ సెటిల్మెంట్
- అధికారుల జేబులు ఫుల్, జిహెచ్ఎంసి ఆదాయం నిల్
- జోనల్ కమిషనర్ జిహెచ్ఎంసి కమిషనర్ పట్టించుకోని వైనం





**హైదరాబాద్,మే23 (నేటి దర్శిని):** గోషామహల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. భవన నిర్మాణ అనుమతులు ఒకలా తీసుకుని, క్షేత్రస్థాయిలో మరోలా నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్లకు కొందరు అధికారులు అండదండలు అందిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా అనుమతులు మించి అదనపు అంతస్తులు, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ సెల్లార్లు నిర్మిస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నోటీసులు కాదు.. సెటిల్మెంట్లే ముఖ్యం..**

స్థానికుల ఆరోపణల ప్రకారం గోషామహల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై నోటీసులు ఇవ్వడం, కూల్చివేతలు చేపట్టడం దాదాపు నిలిచిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. జోరుగా అక్రమ నిర్మాణాలు కడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఫీల్డ్‌కి వెళ్లి పరిశీలించకుండా, "సెటిల్మెంట్" పేరుతో వ్యవహారాలు సాగిస్తున్నారని స్థానికుల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్కో అదనపు అంతస్తుకు ఒక రేటు, గోషామహల్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికార శైలి అక్రమ సెల్లార్‌కు ప్రత్యేక రేటు ఫిక్స్ చేసి భారీగా వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

**సెక్షన్ ఆఫీసర్ మహేందర్ కనుసైగల్లో దందా.?**

గోషామహల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాల వెనుక సెక్షన్ ఆఫీసర్ మహేందర్ పేరు బలంగా వినిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంగల్ హాట్ లోని ప్రకాష్ థియేటర్ ముందు చిన్న వీధిలో ఎదురింటి నెంబర్ 13-1-12/10, భారీ అక్రమ నిర్మాణం అక్రమ సెల్లార్తో జరుగుతుందని ఇప్పటివరకు నోటీసులు కూడా ఇవ్వలేదు అంటే అధికారులకు ఎంత భారి స్థాయిలో లంచాలు అందాయో అర్థమవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి నిర్మాణం తన అనుమతి లేకుండా జరగదని చెప్పుకుంటూ కొందరు బిల్డర్లతో కుమ్మక్కై అక్రమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ కోట్లు గడిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శలు ఉన్నాయి. అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా, సెల్లార్లను కమర్షియల్ వినియోగానికి మార్చుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.ఏసీపీ బాల నంద స్వామిపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అక్రమ నిర్మాణాల వ్యవహారంలో ఏసీపీ బాల నంద స్వామి పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, పత్రికల్లో కథనాలు వస్తున్న పరిస్థితులు మారడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**జిహెచ్ఎంసి ఆదాయానికి భారీ గండి..**

మున్సిపల్ నిబంధనల ప్రకారం నిర్మాణాల నుండి వసూలు కావాల్సిన ఫీజులు, పెనాల్టీలు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా మధ్యలోనే మాయమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించకుండా వదిలేయడంతో జిహెచ్ఎంసి ఆదాయానికి భారీగా గండి పడుతోందని దానితో జిహెచ్ఎంసి ఆదాయం పూర్తిగా తగ్గిపోయి అప్పుల పాలు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఒకవైపు నగరంలో ట్రాఫిక్, పార్కింగ్, డ్రైనేజీ సమస్యలు పెరుగుతుండగా మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగడం ప్రజల్లో ఆగ్రహం రేపుతోంది.

**జిహెచ్ఎంసి విజిలెన్స్ పేరుకేనా.?**

అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ విభాగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జోనల్ కమిషనర్ నుంచి కమిషనర్ స్థాయి వరకు ఫిర్యాదులు వెళ్లినా చర్యలు అసలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రజలు చిన్న షెడ్ వేసుకున్నా నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేస్తారు. కానీ కోట్ల విలువైన అక్రమ భవనాలపై మాత్రం మౌనం ఎందుకు.? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించేనా.?**

గోషామహల్ సర్కిల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న బిల్డర్లతో పాటు వారికి సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్, ఏసిపి అధికారుల ఆస్తులపై కూడా ఏసీబీ విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. నగర అభివృద్ధిని కాపాడాలంటే అక్రమ నిర్మాణాల మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పరిశీలకుడిగా కందడి మణిపాల్ రెడ్డి నియామకం

- కవితమ్మకు కృతజ్ఞతలు తెలిపిన మణిపాల్ రెడ్డి
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : మణిపాల్ రెడ్డి



**ఆలేరు మే23 (నేటి దర్శిని):** తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పరిశీలకుడిగా, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనను నియమించినందుకు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మకు కందడి మణిపాల్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గ ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని, కవితమ్మను తెలంగాణ రాష్ట్ర సీఎం గా చేయడమే ధ్యేయంగా పని చేస్తానని వెల్లడించారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన మణిపాల్ రెడ్డి, ప్రజా సేవే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ చనమల్ల మాధవి జగదీశ్వర్ రెడ్డి



**గుర్రంపోడు, మే 23 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గుర్రంపోడు మండలం మాజీ ఎంపీపీ చనమల్ల మాధవి జగదీశ్వర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం ప్రజా సేవలో కొనసాగుతూ నియోజకవర్గం మరియు రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రజానాయకుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని కోరుకున్నారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా అలాగే స్వయంగా కలిసి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు.

# తీవ్ర ఎండల్లోనూ సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా కృష్ణ గోపాల్ సేవా సమితి

- "మానవ సేవలోనే మాధవుడు"
- రెండు వేల మందికి ప్రసాదం పంపిణీ చేసిన కృష్ణ గోపాల్ సేవా సమితి










**ఎల్.బి.నగర్, మే 23 (నేటి దర్శిని):** "మానవ సేవలోనే మాధవుడు కనిపిస్తాడు" అనే మహోన్నత భావనతో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మూడు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా సమితి సభ్యులు సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి సేవాభావాన్ని చాటుకున్నారు. మొదటి కార్యక్రమంగా వినీత్, ప్రియాంక వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో ఉదయం అల్పాహార కార్యక్రమంతో పాటు కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు దంపతులకు ఆశీర్వాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమితి సభ్యులు వృద్ధులతో ఆప్యాయంగా మమేకమై ఆనందాన్ని పంచుకున్నారు.తదుపరి కార్యక్రమంగా ప్రముఖ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో భారీ స్థాయిలో ప్రసాద పంపిణీ చేపట్టారు. సుమారు రెండు వేల మందికి పైగా భక్తులకు ప్రసాదం అందజేశారు. "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగగా, భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించారు. మూడవ కార్యక్రమంగా వృద్ధాశ్రమంలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. వృద్ధులు సంతోషంగా భోజనం స్వీకరించి, ప్రేమతో సేవ చేస్తున్న సమితి సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.సమాజ సేవే పరమోన్నత ధర్మమనే నమ్మకంతో కృష్ణ గోపాల్ సేవా సమితి నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రజల సహకారం, ఆశీర్వాదాలే తమకు ప్రేరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

# వడ్డెరుల హక్కుల కోసం ఎనిమిదేళ్ల పోరాటం

- కుల ఐక్యతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కమిటీల ఏర్పాటు



**దేవరకొండ, మే 23 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2018లో వడ్డెర సంఘాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర కుల ఐక్యత కోసం కృషి చేస్తున్నట్లు వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి ఆయిల్ మల్లు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి నెల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నాలుగు సమావేశాలు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధి కోసం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు.వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, ప్రత్యేక వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వడ్డెర విద్యార్థులకు ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా వడ్డెర కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో వడ్డెరలకు రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. రూ.20 లక్షల వరకు ఈఎండీ లేకుండా వడ్డెరులకు పనులు కేటాయించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ఎనిమిదేళ్లుగా వడ్డెర సమాజాన్ని ఏకం చేసి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తున్నామని తెలిపారు.వడ్డెరుల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆలయ దక్షిణ మండప నిర్మాణానికి రూ.51 వేల విరాళం

- బీఆర్ఎస్ నాయకుడు అండేకార్ అశోక్ సేవాభావం

**చింతపల్లి, మే 23 (నేటి దర్శిని):** తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ దక్షిణ మండపం నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కుర్మేడు పి.ఏ.సి.యస్ డైరెక్టర్ అండేకార్ అశోక్ రూ.51,000/- (యాభై ఒక్క వేల రూపాయలు) విరాళంగా అందించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అండేకార్ అశోక్‌ను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వారి కృపతో అండేకార్ అశోక్ కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# కరెంటు షాక్‌తో ఆవు మృతి



**నిడమనూరు మే 23 (నేటి దర్శిని):** నిడమానూరు మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామానికి చెందిన రైతు ఇండ్ల వెంకటయ్యకు చెందిన ఆవు కరెంటు షాక్‌కు గురై మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. రైతు వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆవు శుక్రవారం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఈ క్రమంలో శనివారం రోజు బావి సమీపంలో ఆవు మృతదేహం కనిపించింది. దాహంతో నీటి కోసం బావి వద్దకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో ఆవు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో తనకు సుమారు రూ.50 వేల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతు వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

# బిజినెస్

## మార్కెట్లోకి రోర్ ఈవో బైకు



**హైదరాబాద్,**
:దేశీయ ఎలక్ట్రిక్ మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ మరో బైకును రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. రోర్ ఈవో పేరుతో విడుదల చేసిన ఈ మోటర్‌సైకిల్ ప్రారంభ ధర రూ.99,999గా నిర్ణయించింది. ఈ ధర కేవలం తొలి 10 వేల బుకింగ్‌లకు మాత్రమే వర్తించనున్నదని, ఆ తర్వాత ఈ బైకు ధర రూ.1,24,999కి పెంచుతున్నట్టు వెల్లడించింది. 3.4 కిలోవాట్ల ఎల్‌ఎఫ్‌పీ బ్యాటరీతో తయారైన ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం మూడు సెకండ్లలో 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ బైకు గంటకు 110 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. కేవలం 90 నిమిషాల్లో 80 శాతం వరకు చార్జింగ్ కానున్న బ్యాటరీపై ఎనిమిదేండ్ల వ్యారెంటీని కల్పిస్తున్నది. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్(సేల్స్ అండ్ మార్కెటింగ్) హర్షవర్ధన్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ..ప్రస్తుతం తెలంగాణలో ఐదు షోరూంలు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వీటి సంఖ్య ను 25కి పెంచుకోనున్నట్టు చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో హైదరాబాద్ వాటా 10 శాతంగా ఉన్నదన్నారు

## గోల్డ్ రేట్స్.. రెండో రోజూ పతనం

ఇంటర్నెట్ డెస్క్
భారత్‌లో శనివారం కూడా బంగారం ధరలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ధరలు తగ్గడం వరుసగా ఇది రెండోసారి. వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, (మే 23) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర క్రితం ముగింపుతో పోలిస్తే రూ.430ల మేర తగ్గి రూ.1,59,060కు దిగొచ్చింది. 22 క్యారెట్ల పసిడి కూడా నిన్నటితో పోలిస్తే రూ.400ల మేర తగ్గి రూ.1,45,800కు చేరుకుంది. నగరంలో వెండి ధర మత్రం రూ.2.95 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది.
దేశవ్యాప్తంగా కూడా బంగారం ధరలు స్వల్ప స్థాయిలో తగ్గాయి. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,690కు చేరుకుంది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,47,300గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,060గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,45,800గా ఉంది. రాజధాని న్యూఢిల్లీలో మేలిమి బంగారం ధర రూ.1,59,210 వద్ద, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,45,950 వద్ద కొనసాగుతోంది.



గమనిక: బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు చేసే ముందు ఒకసారి వీటి ధరలు పరిశీలించుకోవాలని సూచన.

## హోండా నుంచి జెడ్‌ఆర్-వీ మాడల్..


### -ప్రారంభ ధర రూ.11.99 లక్షలు

న్యూఢిల్లీ
జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం హోండా..దేశీయ మార్కెట్లో ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా మరో మాడల్‌ను తీసుకొచ్చింది. ప్రీమియం ఎస్‌యూవీ జెడ్‌ఆర్-వీ మాడల్‌ను పరిచయం చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.11.99 లక్షలుగా నిర్ణయించింది. ఈ సందర్భంగా హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ సీఈవో, ప్రెసిడెంట్ తకాశి నకజిమా మాట్లాడుతూ..దేశీయ మార్కెట్లో మరింత పాగ వేయడానికి 2030 నాటికి మరో 10 కొత్త మాడళ్లను తీసుకురానున్నట్టు ప్రకటించారు.వీటిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో విడుదల చేయనున్న ఎలక్ట్రిక్ కారు కూడా ఉందన్నారు. నాలుగు మీటర్ల లోపు పొడువు కలిగిన మాడళ్లతోపాటు మధ్యస్థాయికి చెందిన వాహనాలకు దేశీయంగా డిమాండ్ అధికంగా ఉండటంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. కంపెనీకి ఉత్తర అమెరికాతోపాటు జపాన్, భారత్ మార్కెట్లు చాలా కీలకంగా మారాయని, ఇక్కడి కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా వాహనాలను రూపొందిస్తున్నట్టు తెలిపారు.




## విరాట్ కోహ్లీపై నెటిజన్లు ఫైర్!

హైదరాబాద్ వేదికగా ఆర్సీబీ, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య జరిగిన మ్యాచ్ వన్‌సైడెడ్‌గా సాగినా గ్రౌండ్‌లో జరిగిన డ్రామా మాత్రం చర్చకు దారితీస్తోంది. కోహ్లీ బ్యాటింగ్ చేసినప్పుడు హెడ్ కవ్విస్తూ కామెంట్స్ చేశాడు. అప్పుడే విరాట్ సీరియస్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా హెడ్ షేక్ హ్యాండ్ ఇస్తే పట్టించుకోకుండా విరాట్ వెళ్లిపోయాడు. ఇప్పుడు దీన్నే నెటిజన్లు తప్పుబడుతున్నారు. ఇది అహంకార పూరితమైన ప్రవర్తన అని కామెంట్స్ చేస్తున్నారు. ఉప్పల్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఓపెన్ అభిషేక్ శర్మ(56) ఇషాన్ కిషన్(79) మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ (51) తన స్టైల్‌లో ఇన్నింగ్స్ ముగించాడు. బెంగళూరు బౌలర్లు హైదరాబాద్ బ్యాటర్లను అడ్డుకోవడంలో విఫలమయ్యారు. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు ఇన్నింగ్స్ సమయంలో అసలు డ్రామా మొదలైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రీజులో ఉన్నప్పుడు చాలా దూకుడుగా కనిపించాడు. వరుసగా ఫోర్లు బాదిన తర్వాత కోహ్లీ ఎస్‌ఆర్‌హెచ్ ప్లేయర్ ట్రావిస్ హెడ్‌ను ఉద్దేశించి వచ్చి




బౌలింగ్ చేయ్ అన్నట్టు కామెంట్ చేశాడు. దీనికి సమాధానంగా హెడ్ కేవలం చిరునవ్వుతోనే బదులిచ్చాడు. అయితే ఈ మాటల యుద్ధం కోహ్లీకి కలిసి రాలేదు. కేవలం 15 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టింది.” వచ్చాడు, బౌలింగ్ చేశాడు, వికెట్ పడగొట్టి వెళ్లిపోయాడు” అంటూ క్యాప్షన్ ఇచ్చింది. నిజానికి ట్రావిస్ హెడ్ బౌలింగ్‌కు వచ్చి ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ తీశాడు. కోహ్లీ హెడ్‌ను బౌలింగ్ చేయమని సవాల్ చేసినందున ఈ పోస్టు కోహ్లీని ఉద్దేశించిందేనని అభిమానులు భావిస్తున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా కోహ్లీ కోపం తగ్గలేదు. పెవిలియన్ నుంచి వస్తూ అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చాడు కోహ్లీ. కానీ ట్రావిన్స్ హెడ్‌తో చేతులు కలపకుండా పక్కకు తప్పుకొని వెళ్లిపోయాడు. దీనికి హెడ్ కూడా షాక్ అయ్యి నవ్వి ముందుకెళ్లిపోయాడు. దీనిపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మైదానంలో జరిగిన విషయాలను ఇలా సీరియస్‌గా తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రేపో మాపో రిటైర్ కాబోతున్నా కూడా మెచ్యూరిటీ రాలేదా అని ఎద్దేవా చేస్తున్నారు. మరికొందరు కోహ్లీ అహంకారపూరితంగా వ్యవహరించారని అంటున్నారు. ఆ వ్యక్తి యాటిట్యూడే అలా ఉంటుందని, నచ్చితే మాట్లాడుతాడు లేకుంటే అసలు పట్టించుకోడని అంటున్నారు. ఈ మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో బెంగళూరు విఫలమైంది. దీంతో ఎస్‌ఆర్‌హెచ్ 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆర్సీబీ తరఫున వెంకటేష్ అయ్యర్ 44 పరుగులు, రజత్ పాటిదార్ 56 పరుగులు, కృనాల్ పాండ్యా 41 పరుగులు చేశాడు. ఈ ఓటమి బెంగళూరుకు పెద్దగా నష్టం చేయలేదు. మెరుగైన రన్‌రేటు కారణంగా పాయింట్ల పట్టికలో ఆర్సీబీ టాప్2లో ఉంది. నేరుగా క్వాలిఫైయర్ 1కు అర్హత సాధించింది. క్వాలిఫైయర్ 1లో గుజరాత్‌టైటాన్స్‌తో తలపడనుంది.

# స్పోర్ట్స్

## మళ్లీ కుస్తీ పట్టనున్న వినేశ్..

### - ఆసియా క్రీడల ట్రయల్స్‌కు అనుమతించిన హైకోర్టు..!




భారత రెజ్లింగ్ సమాఖ్య తో పోరాడుతున్న వినేశ్ ఫొగాట్ పునరాగమనానికి అడ్డంకులు తొలగిపోయాయి. ఆసియా క్రీడల ఎంపిక పోటీల్లో ఆమె పాల్గొనేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. తల్లైన రెజర్ల విషయంలో డబ్ల్యూఎఫ్ఐ నిబంధనలు అనుచితంగా ఉన్నాయని పేర్కొన్న ధర్మాసనం వినేశ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పునిచ్చింది. దాంతో.. ఆమెను అడుగడుగునా అడ్డుకోవాలని చూసిన బ్రిజ్ భూషణ్ గ్యాంగ్‌కు హైకోర్టు నిర్ణయం చెంపపెట్టు కానుంది.ఆసియా క్రీడలతో పునరాగనం చేయాలనుకున్న వినేశ్ ఫొగాట్ కల నిజమవ్వనుంది. భారత రెజ్లింగ్ సమాఖ్య నిబంధనలపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన వినేశ్‌కు అనుమతి లభించింది. ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్.. వినేశ్‌ను ఆసియా క్రీడల ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించింది. ఎంపిక ప్రక్రియను వీడియో రికార్డు చేయాలని రెజ్లింగ్ సమాఖ్యను కోర్టు ఆదేశించింది. భారత స్పోర్ట్స్ అథారిటీ, భారత ఒలంపిక్ సంఘానికి చెందిన స్వతంత్ర ప్రతినిధులు ట్రయల్స్‌ను పర్యవేక్షించనున్నారు. మే 30 నుంచి 31 తేదీల్లో ట్రయల్స్ జరుగనున్నాయి.మే 30, 31వ తేదీల్లో జరుగబోయే ఆసియా క్రీడల ఎంపిక పోటీల్లో వినేశ్ ఫొగాట్ పాల్గొనేందుకు అనుమతిస్తున్నాం. ప్రముఖులైన క్రీడాకారిణులపై ప్రసూతి సెలవుల తీసుకున్నారనే నెపంతో ప్రతీకార చర్యలకు దిగడం సహేతుకం కాదు. వినేశ్‌కు పంపిన షోకాజ్ నోటీసు కూడా ఇదివరకే ముగిసిన విషయం గురించినది. కాబట్టి.. వినేశ్‌ను పోటీపడేందుకు అనుమతించడం అత్యవసరం. అటు క్రీడలు, ఇటు న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం’ అని ద్విసభ్య బెంచ్ పేర్కొంది.

## శ్రేయస్ అయ్యర్ సెంచరీ విధ్వంసం..

### లక్నోపై పంజాబ్ కింగ్స్ ఘన విజయం!

టాటా ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చింది. వరుసగా ఆరు ఓటముల తర్వాత ఎట్టకేలకు లక్నో సూపర్ జాయింట్స్ (ఎల్ఎస్‌జీ) పై 7 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. ఏకానా స్టేడియంలో జరిగిన ఈ చావో రేవో పోరులో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగి, తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేశాడు. ఈ విజయంతో పంజాబ్ ప్లేఆఫ్స్ రేసులో తన ఆశలను సజీవంగా ఉంచుకుంది. మొదట నిలకడగా ఆడిన లక్నోటాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. లక్నో ఓపెనర్ జోష్ ఇంగ్లిస్ (44 బంతుల్లో 72 పరుగులు; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆరంభం నుంచే పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత వచ్చిన ఆయుష్ బదోని కేవలం 18 బంతుల్లో 43 పరుగులు చేసి లక్నో స్కోరు బోర్డును పరుగెత్తించాడు. అయితే పంజాబ్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ (2/25), మార్కో జాన్సెన్ (2/33) లక్నో మిడిల్ ఆర్డర్‌ను కట్టడి చేశారు. ఆఖరి ఓవర్లలో అబ్దుల్ సమద్ (37) మెరుపులతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీ స్కోరు చేసింది. శ్రేయస్ అయ్యర్ ‘శతక’ గర్జన197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్




తొలి బంతికే ప్రియాంశ్ ఆర్య వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కోపర్ కానల్లీ (18) కూడా త్వరగానే పెవిలియన్ చేరాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (39 బంతుల్లో 69 పరుగులు) దూకుడుగా ఆడి రన్ రేట్ తగ్గకుండా చూశాడు. మరోవైపు శ్రేయస్ అయ్యర్ లక్నో బౌలర్లను నలుమూలలా బాదుతూ కేవలం 51 బంతుల్లోనే 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 101 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆఖరిలో సిక్సర్ బాదడమే కాకుండా, తన మెయిడెన్ ఐపీఎల్ సెంచరీతో మ్యాచ్‌ను ముగించాడు. పంజాబ్ కింగ్స్ 18 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసి ఘన విజయం సాధించింది.

# 'కరుప్పు' బాక్సాఫీస్ దూకుడు..

## -తమిళనాడులో మరో రూ.100 కోట్ల మూవీ..




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే 'కరుప్పు' ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి.గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను 'కరుప్పు' సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.సినిమా వసూళ్ల విషయానికి వస్తే.. తొలి వారంలో దేశీయంగా నెట్ కలెక్షన్లు రూ.113 కోట్లకు పైగా నమోదైనట్లు సమాచారం. ఎనిమిది రోజులకు ఈ సంఖ్య మరింత పెరిగింది. విదేశీ మార్కెట్‌లో కూడా ఈ సినిమా మంచి వసూళ్లు సాధిస్తోంది. మొత్తం కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వచ్చినప్పటికీ, తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. ఈ విజయంతో 'కరుప్పు' సూర్య కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అలాగే ఈ ఏడాదిలో అత్యంత విజయవంతమైన తమిళ చిత్రాల్లో కూడా స్థానం సంపాదించుకుంది. దర్శకుడు ఆర్జే బాలాజీ తెరకెక్కించిన ఈ చిత్రానికి దైవిక నేపథ్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గ్రామ దేవత అయిన 'వెట్టై కరుప్పు' ఆధారంగా రూపొందించిన కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఒక తండ్రి, కూతురికి న్యాయం చేయడానికి దేవుడు మానవ రూపంలో భూమిపైకి వచ్చే కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. సూర్య, త్రిషతో పాటు ఆర్జే బాలాజీ, ఇంద్రన్స్, అనఘా మాయా రవి, నట్టి సుబ్రమణ్యం, శ్వాసిక తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సంగీతం, భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు మరింత బలాన్ని చేకూర్చాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం 'కరుప్పు' విజయంతో సూర్య అభిమానులు ఆనందంలో మునిగిపోతుండగా, ఈ సినిమా మరిన్ని రికార్డులను అందుకునే అవకాశాలపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.





# నాగార్జునకు మే 23 స్పెషల్

## తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు




తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

# ఆదర్శకుటుంబంలో అతిథిగా?



వ్యక్తిగత జీవితంలోని ఒడిదుడుకుల కారణంగా దాదాపు మూడేళ్లుగా సినిమాలకు దూరమైంది తమిళ సొగసరి నివేదా పేతురాజ్. దుబాయ్‌కి చెందిన ఓ వ్యాపారవేత్తతో విఫల ప్రేమాయణం ఈ భామను మానసికంగా కుంగదీసిందని చెబుతారు. అందం, అభినయం కలబోసిన పాత్రల్లో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన ఈ భామ టాలీవుడ్‌లో పునరాగమనానికి సిద్ధమవుతున్నది. తాజా సమాచారం ప్రకారం వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆదర్శకుటుంబం' చిత్రంలో నివేదా పేతురాజ్ అతిథి పాత్రలో నటించనున్నట్లు తెలిసింది.ఈ సినిమాలో కథానాయికగా శ్రీనిధి శెట్టి నటిస్తుండగా..కీలకమైన అతిథి పాత్రలో నివేదా పేతురాజ్ కనిపించనుందని సమాచారం. త్వరలో 'ఆదర్శకుటుంబం' సెట్స్‌లోకి ఈ తమిళందం అడుగుపెట్టబోతున్నదట. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను జోడించి తనదైన కామెడీ హంగులతో దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.



# అవన్నీ ఫేక్..

## బికినీ ఫొటోలపై స్పందించిన నటి రుక్మిణి వసంత్



'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు.అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా AI ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతారాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365